ప్రజాశక్తి

ఆదివారం 31 డిసెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గొప్ప విప్లవకారుడు.. కార్మిక పక్షపాతి ఎన్‌పిఆర్

విశాఖ పరిశ్రమల్లో సంఘాల ఏర్పాటుకు ఆద్యుడు

సెమినార్‌లో ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్, సిహెచ్.నరసింగరావు, ఎంవిఎస్ శర్మ



సెమినార్‌లో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రపంచీకరణ విధానాలపై పోరాడడంలో కార్మికపక్షం వహిస్తూ గొప్ప విప్లవకారుడిగా పేరుతెచ్చుకున్న తొలి తరం కార్మికోద్యమ నేతల్లో నండూరి ప్రసాదరావు, పర్సా సత్యనారాయణ ఇద్దరూ యోధులని, వారి ఆశయ స్ఫూర్తితో ప్రజా, కార్మికపోరాటాలకు నాయకత్వం వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్‌పట్నాయక్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదట ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావు 23వ వర్థంతి సందర్భంగా నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'ప్రపంచీకరణ– నిరుద్యోగం–పరిష్కారమార్గాలు' అన్న అంశంపై సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన శనివారం సెమినార్ (స్మారకోపన్యాసం) నిర్వహించారు. సెమినార్‌కు ముందు ఎన్‌పిఆర్ చిత్రపటానికి ప్రముఖ వక్తలంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ, దేశంలో రైతాంగానికి వ్యతిరేకంగా కార్పొరేట్ వ్యవసాయం కోసం నల్లచట్టాలను మోడీ ప్రభుత్వం తేవడాన్ని ఆయన గుర్తుచేశారు. మరోవైపు నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్లకు కట్టబెట్టడం, ఆస్తులను ప్రైవేట్ వారికిచ్చేయడం, లేదంటే పరిశ్రమలను మూసేసే విధానం కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం సమంజసం కాదన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్

మిగతా 2లో..



ధూం.. ధాం ముగింపు సభలో మాట్లాడుతున్న గంగారావు

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం...

కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎదుర్కొందాం...

ధూం.. ధాం ముగింపులో గంగారావు 8లో

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉద్రిక్తం



మున్సిపల్ కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

వార్తలు 4లో...

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళనలు

వార్త 7లో

మొదటి పేజీ తరువాయి..

గొప్ప విప్లవకారుడు..

కార్మిక పక్షపాతి ఎన్‌పిఆర్

అయినా ఇంకేదైనా ప్రజామోదం లేకుండా పరిశ్రమపై ఎగ్జిక్యూటివ్ నిర్ణయాలు చేయకూడదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలుంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వీటి రక్షణ కోసం ట్రేడ్‌యూనియన్‌లు బలమైన పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో ఒక్కశాతం ఉన్న కార్పొరేట్ల వద్ద 80శాతం ప్రజల ఆస్తులు, సంపదలు కేంద్రీకృతమైపోయాయన్నారు.

పెట్టుబడిదారీ విధానం వల్లే నిరుద్యోగం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానం వల్లే దేశంలో నిరుద్యోగం దారుణంగా పెరుగుతోందన్నారు. దేశ రైల్వేల్లో ఒకప్పుడు 18లక్షల మంది ఉద్యోగులుంటే 8 లక్షలకు బిజెపి కుదించేసిందని మండిపడ్డారు. 3.80లక్షల ఖాళీలు రైల్వేల్లో ఉన్నా కేంద్ర ప్రభుత్వం నింపడం లేదన్నారు. సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులే నిరుద్యోగుల సమస్యలపై పోరాడాలన్నారు. ఈ తరహా కృషిని 1970వ దశకంలో నండూరి ప్రసాదరావు విశాఖలో ప్రారంభించారన్నారు. ఆయన కార్మిక ఉద్యమాల్లో కీలకపాత్రపోషించారన్నారు. 1930వ దశకంలో దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనే అనుభవంతో ప్రభుత్వ రంగ పరిశ్రమలైన షిప్‌యార్డు, ఇతర సంస్థలైన కోరమండల్‌లో యూనియన్ల స్థాపనకు అశేషంగా కృషిచేశారని కొనియాడారు. షిప్‌యార్డు బోర్డు డైరెక్టర్‌గా ఎన్‌పిఆర్ ఎంపికవ్వడం ఆయన కార్మికోద్యమానికి చేసిన సేవలకు తార్కాణమన్నారు. షిప్‌యార్డులో ఐఎన్‌టియుసి చేసిన మూడు సున్నాల వేతన ఒప్పందాన్ని రద్దు చేసి మెరుగైన వేతన ఒప్పందాన్ని చేసిన ఘనత ఎన్‌పిఆర్‌దన్నారు. ఈరోజు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం, మున్సిపల్, అంగన్‌వాడీ, సమగ్ర శిక్ష వంటి సమ్మెలు విజయవంతం అయ్యేలాగ పోరాడడమే ఆయనకు నిజమైన నివాళి అని కొనియాడారు.

ప్రజల దృష్టిని మరలించే కుట్రలపై సమిష్టి పోరాటం : ఎంవిఎస్ శర్మ

యావత్ కార్మికవర్గాన్ని ప్రత్యామ్నాయ విధానాల వైపు ఆలోచించేలాగ కృషిచేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. నయా ఉదార వాద విధానాల పరిధిలోనే ఆలోచిస్తే 'హక్కు'ల గురించి ఆలోచించడం మానేస్తామని హెచ్చరించారు. విద్య, వైద్యం, తిండి, ఉద్యోగం ప్రజల హక్కు అని పాలకులకు అర్థమయ్యేలాగ పోరాటాలు చేపట్టాల్సి ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, పారిశుధ్య కార్మికులు చేసే పనులకు గౌరవ వేతనం అని పేరుపెట్టడం చూస్తే పాలకుల దోపిడీ కనబడకుండా కార్మికులను పాలకులు మానసికంగా సిద్ధం చేశారన్నారు. వేతన సమస్యలను హక్కుల పోరాటంగా మార్చే ఉద్యమాలు చేస్తూ హక్కులను గ్యారెంటీ చేసే పోరాటాలు చేయాలన్నారు. ఇందుకు భావజాల రంగంలో ప్రత్యామ్నాయం కోసం సమిష్టిగా కృషి చేయాలని సిఐటియుకు పిలుపునిచ్చారు. సెమినార్‌లో ఎయూ పూర్వ ప్రొఫెసర్ కె నళిని, కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కన్వీనర్లు రెడ్డి వెంకటరావు, కెఎం.శ్రీనివాస్, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, పి.మణి, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు తులసి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు. సెమినార్ వేదికపై శారదా ట్రస్ట్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభాత్ పట్నాయక్ సహా అతిథులు ఆవిష్కరించారు. గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణభారతి బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : లింగ్-మెఇ ప్రాధాన్ స్పోర్ట్స్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న స్వర్ణ భారతి బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు శనివారం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో మధురవాడ సబ్ రిజస్ట్రార్ ఎస్.మోహన్‌రావు, అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారిణి, 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ ప్రారంభించారు. సాప్ మేనేజింగ్ డైరెక్టర్ ధ్యానంచంద్ర, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ ఈ పోటీలు విజయవంతం కావాలన్నారు. ఈ సందర్భంగా లీగ్ నిర్వాహకులు ఆసిఫ్, అదిత్య మీడియాతో మాట్లాడుతూ స్వర్ణ భారతి స్టేడియం క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని ఈ క్రమం లో ఈ ఏడాది డిసెంబర్ 30,31 తేదిలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలు ఐపిఎల్ తరహాలో 8 జట్లు తలపడుతున్నాయని, మొత్తం 60 మంది క్రీడాకారులను వేలం పద్ధతిలో 8 జట్లుగా విభజించినట్లు తెలిపారు. ఈ పోటీలు ఆదివారం సాయంత్రం ముగుస్తాయని, గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. తొలిరోజు జరిగిన పోటీలలో సౌన సూపర్ కింగ్స్, డేవిడ్ ఫైటర్స్, అన్ స్టోపబుల్స్, మైటీ గరుడాస్ విజేతలుగా నిలిచి సెమీఫైనల్స్ కు అర్హత సాధించారు.



పోటీల ప్రారంభంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్

సాగర తీరంలో పోరాటాల ప్రవాహం...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

"ఓడలో అడుగున కొంత బరువు వెయ్యనిదే అది తిన్నగా ప్రయాణం చేయలేదు" ప్రభుత్వాలపై ప్రజా డిమాండ్ల ఒత్తిడి లేకపోతే అడ్డులేని అధికారంతో పాలకులు చెలరేగిపోతారనడంలో ఎలాంటి సందేహం లేదు. విశాఖ సాగర తీరంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లు, ఆశా వర్కర్లు తమ హక్కులైన కనీస వేతనం రూ.26వేలు, ఉద్యోగ రక్షణ, రెగ్యులరైజేషన్ కోసం చేపట్టిన పోరాట నినాదం అన్ని తరగతుల ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఇన్నేళ్ల కాలంలో ఒకే సారి ఇన్ని తరగతుల ప్రజానీకం రోడ్డెక్కి తమ సమస్యల పరిష్కారం కోసం నినదించింది లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒకవైపు 1000 రోజులకు పైగా సాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం మిగతా పోరాటాలకు దిక్సూచిగా నిలుస్తోంది.

'చెప్పాడంటే చేస్తాడంతే'లో చేసిందెంత?

పాలకులంటేనే 'చేసేది చెప్పరు, చెప్పింది చేయరు' అన్న నానుడి గుర్తుకు తెచ్చేలాగ రాష్ట్ర ప్రభుత్వ తీరు కనిపిస్తోంది. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రమంతటా పాదయాత్రలో తిరిగిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తొలినుంచీ పై తరగతుల చిరుద్యోగులు



వినతిపత్రాలు, ఆందోళనల ద్వారా ప్రభుత్వానికి తెలియజేసినా ఫలితం లేకపోయింది. మా జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అన్న నినాదాన్ని మంత్రులు, వైసిపి పెద్దలు ప్రచారంలో పెట్టినా క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, జీతాల పెంపు వంటి విషయాల్లో అమలు చేయలేదు. విశాఖ జిల్లాలో ప్రత్యేకంగా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయమై పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు.

చర్చల పేరుతో సాగదీత...

రాష్ట్ర ప్రభుత్వం పై తరగతుల సమస్యలపై చర్చల పేరుతో అన్ని జిల్లాల్లోనూ పరిష్కారం చూపకుండా మొండికేసే వైఖరినే తీసుకుంటుంది. శనివారం మధ్యాహ్నం విశాఖలో సర్వశిక్ష అభియాన్ ఇతర ఉద్యోగ సంఘాలతో మంత్రి చర్చలు సాగించినా పాత పాటే ఇప్పుడేమీ ప్రభుత్వం చేయలేదన్న సంగతినే అత్యధికంగా వల్లెవేశారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లక్షల సంఖ్యలో ఉన్న ఈ చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం సరైన విధానం తీసుకోకపోతే రాజకీయంగా వైసిపి నష్టపోతుందన్నది సర్వత్రా తాజాగా వినిపిస్తున్న మాట. ప్రతి రోజూ ఉదయాన్నే ఎలాగైతే విధులకు వీరు వెళతారో అదే మాదిరిగా పోరాటం, ఆందోళనలకు ఉద్యోగులంతా జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు ఉదయం 10గంటలకల్లా చేరుకోవడం కనిపిస్తోంది. ఈ చిరుద్యోగుల హక్కులను కాలరాయకుండా తక్షణమే పరిష్కరించాలన్న డిమాండ్ అన్ని తరగతుల నుంచీ వినిపిస్తోంది.

జిందాల్‌తో ఒప్పందాన్ని బయటపెట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జిందాల్‌తో చేసిన ఒప్పందాన్ని బయటపెట్టాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ డిమాండ్‌చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1003వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (ఎఐటియుసి) కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని లలితమ్మ ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగా రహస్యంగా జిందాల్‌తో ఒప్పందాలు చేసు కుంటున్నారని విమర్శించారు. రూ.లక్షల కోట్ల ఆస్తులు కలిగిన స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తికి అమ్మ జూపాలని చూడడం దేశద్రోహ చర్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎం.మన్మధరావు, కసిరెడ్డి సత్యనారాయణ, కె.అచ్యుతరావు, డి.తిరుపతి, సిహెచ్.సత్యనారాయణ, ఎ.అజయ్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యం : మేయర్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖ నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జివిఎంసి 19, 20 వార్డులలోని పలు అభివృద్ధి పనులకు ఎంపీ ఎంవివి సత్యనారాయణ, 20వ వార్డు కార్పొరేటర్ నెక్కల్ల లక్ష్మితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 19వ వార్డు పరిధి పెదజాలారిపేట బాబూజీనగర్‌లో సుమారు రూ.49.00 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, కురుపాం జంక్షన్ నుంచి రాయల్ అపార్ట్మెంట్ వరకు రూ.93.30 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి, 20వ వార్డు పరిధిలోని మానసిక ఆసుపత్రి రోడ్డు వద్ద రూ.49.65 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి, ఎంవిపి కాలనీ బృందావనం పార్కులో రూ.95.00 లక్షలతో మౌలిక వసతుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనువాద పార్టీలను ఓడించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికలలో మతతత్వ, మనువాద బిజెపి వంటి పార్టీలను చిత్తుగా ఓడించాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు సునీల్ కుమార్ రామ్ టెకి పిలుపునిచ్చారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని దేశ ప్రజల అభీష్టానికి భిన్నంగా బిజెపి ప్రభుత్వం మార్చి వేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు టీవీ చక్రవర్తి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 30 అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని చెప్పారు. ఎపిలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొమ్మేటి అప్పారావు, పి.నాగరాజు, జి.రాజారావు, భైరవమూర్తి, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.62.72 లక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం రూ.62 లక్షలా 72 వేలా 557 వచ్చిందని దేవస్థానం కార్య నిర్వహణాధికారి కె.శిరీష మీడియాకు తెలిపారు. ఈ నెల 4 నుంచి 30వ తేదీ వరకు లెక్కించగా, పైనగదుతో పాటు బంగారం 2 గ్రాముల 079 మిల్లీ గ్రాములు, వెండి 730 గ్రాములు, ఫారెన్ కరెన్సీ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్య నిర్వహణాధికారి కె.తిరుమల్లేశ్వరరావు, శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం కార్యనిర్వహణ అధికారి పిఎల్‌ఎన్ రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

జగన్‌కు సైకలాజికల్ డిజార్డర్ : గంటా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైకలాజికల్ డిజార్డర్‌తో బాధపడుతున్నారని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయని, జగన్ ఎటు ప్రయాణం చేస్తున్నాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. అమలుకు వీలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ 99.9 శాతం హామీలు అమలు చేశానని బూటకపు మాటలు చెపుతున్నాడన్నారు. ఎన్నికలకు ముందు 730 హామీలు ఇచ్చారని, వీటిలో 21 హామీలు మాత్రమే అమలు చేసాడన్నారు. కేవలం 3 శాతం మాత్రమే అమలు చేశారని తెలిపారు. పాక్షికంగా 88 అమలు చేశారని పేర్కొన్నారు. రాజధాని అమరావతికి తూట్లు పొడిచాడని విమర్శించారు. విశాఖ ఎగ్జిక్యూటివ్ కేపిటల్ అని ఒక్క ఇటుకు వెయ్యలేదన్నారు. కర్నూలు న్యాయ రాజధాని అని విస్మరించాడని తెలిపారు. టిడిపి హయాంలో పోలవరం 74 శాతం పూర్తయ్యిందని, వైసిపి హయాంలో 4 శాతం కూడా అవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, చిక్కాల విజయబాబు, పొడుగు కుమార్, నడిగట్ల శంకరరావు, కోనేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



ఆరోగ్య శ్రీ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని రేఖవానిపాలెం సచివాలయం వద్ద ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఇఒపిఆర్‌డి అప్పల రాజు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎబి మల్లికార్జునరావు పాల్గొన్నారు .

స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీ బరిలోకి...

ప్రజాశక్తి పద్మనాభం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తాను అసెంబ్లీ బరిలో పోటీ చేస్తానని నాగోతి నాగమణి ప్రకటించారు. శనివారం పద్మనాభంలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ, భీమిలిలో ఇన్నాళ్లుగా స్థానికేతరులే ఎమ్మెల్యేలుగా పోటీలో ఉండడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా ఉందని, వారి స్వప్రయోజనాలే తప్ప నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేశా రన్నారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తాను పోటీలో నిలిచి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మాలతాంబ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి -పిఎం పాలెం : సాంకేతిక కళాశాల మైదానంలో మాలతాంబ విద్యానికేతన్ వార్షిక స్పోర్ట్స్‌మీట్ ఘనంగా ప్రారంభమైంది. శని, ఆదివారాల్లో రన్నింగ్, క్రికెట్, త్రోబాల్, షాట్ పుట్, ఖోఖో, రిలేరేస్, పిరమిడ్స్, యోగ ఆసనాలు, మార్షల్ ఆర్ట్స్, యుద్ధ కళలు, కల్చరల్ ఈవెంట్స్ అలరించాయి. ఎన్ఎవిఎన్ఎస్. సిఇఒ, విశ్రాంత ఎఎస్‌పి ప్రసాద్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సునీల్ మహంతి, డిప్యూటీ డిఇఒ గౌరీశంకర్ సాంకేతిక విద్యాసంస్థల ఇఒ మధుబట్ స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ బాలకృష్ణ, వి.హనుమంతరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎ.ఆదిమూర్తి, వైస్‌ప్రిన్సిపల్ బి శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ బి హరీష్, కరాటే కోచ్ సరస్వతి పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : బాల్యం పాఠశాల ఉపాధ్యాయులకు పలు అంశాలపై స్థానిక ప్రభుత్వ డైట్‌లో రెండ్రోజుల పాటు జరిగిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ మాట్లాడుతూ జివిఎంసి పరిధిలో అంగన్వాడీ కేంద్రాల మాదిరిగా బాల్యం పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను బోధిస్తున్న ఉపాధ్యాయులు పిల్లల శారీరక, మానసిక భావోద్వేగ ఎదుగుదలకు తగిన విధంగా బోధన చేయాలని సూచించారు. ట్రైనింగ్ కో ఆర్డినేటర్ జి. రవి మాట్లాడుతూ, 30 ఏళ్ల నుంచి బాల్యం పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు శాస్త్రీయ శిక్షణ పూర్తి చేశారని, రానున్న రోజుల్లో ఆరు రోజుల పాటు ఇంటిగ్రేటెడ్ శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. అధ్యాపకులు సోమయాజులు, హరిణి, మహాలక్ష్మి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లలిత, హర్దిని రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. డివైఇఒ ఎ గౌరీశంకరరావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు పాల్గొన్నారు

1న కనకమహాలక్ష్మికి కుంకుమార్చన

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని రేవిడింద గ్రామపంచాయతీలో పుప్పాల వారి ఇంటి ప్రాంగణంలో జనవరి ఒకటో తేదీన విశాఖపట్నం కనకమహాలక్ష్మి దేవస్థానం, ఇఒ కె.శిరీష్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో 1న సోమవారం ఉదయం 9గంటల నుంచి నిర్వహించే కుంకుమార్చనల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైసిపి సభ రసాభాస!

సుబ్బారెడ్డి సాక్షిగా రెండుగా చీలిన గ్రూపులు
పోటాపోటీ నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం
ఎమ్మెల్యే అభ్యర్థిగా చందును ప్రకటించిన వైవి

ప్రజాశక్తి -గాజువాక : స్థానిక టిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం రసాభాసగా సాగింది. ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కొత్త సమన్వయకర్త ఉరుకుటి చందు వర్గాలు బలప్రదర్శనకు ఈ సమావేశం వేదిక కాగా, వారి అనుకూలురు రెండు గ్రూపులుగా చీలిపోయి పెద్దఎత్తున నినాదాలు చేయడంతో సభాప్రాంగణం హోరెత్తింది. వైవి.సుబ్బారెడ్డి సమావేశానికి రాకముందు ఎవరికి వారే జై నాగిరెడ్డి, జై చందు అంటూ పోటాపోటీగా దాదాపు రెండుగంటల పాటు నినాదాలు చేయగా, సుబ్బారెడ్డి వచ్చిన తర్వాత మరింత తీవ్రమైంది. వైవి.సుబ్బారెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి వర్గీయులు, తిప్పలకు మళ్లీ టిక్కెట్ కేటాయించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడిస్తామని ఎమ్మెల్యేకు మద్దతుగా ఆ పార్టీ నేత రోజారాణి, 75వ వార్డు వైసిపి అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డితో పాటు కొంతమంది కార్యకర్తలు నినాదాలు చేశారు. దీనికి కౌంటర్‌గా చందు వర్గయులు కూడా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మెజార్టీ కార్పొరేటర్ల అభిప్రాయాలను తెలుసుకోవాలని సమన్వయకర్త సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే నాగిరెడ్డి సూచించినప్పటికీ, వైవీ ఆ మాటలను లెక్కచేయలేదు. రెండుగంటలకు పైగా రెండు వర్గీయుల పోటాపోటీ నినాదాలతో సభ గందరగోళంగా మారగా, పోలీసులు జోక్యం చేసుకుని శాంతింపచేయాల్సి వచ్చింది.

గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి చందు : సుబ్బారెడ్డి

పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగిన తర్వాత వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, సామాజిక సమీకరణలు, పలు సర్వేలను చేయించిన ముఖ్యమంత్రి జగన్, గాజువాక సమన్వయకర్తగా ఉరుకుటి చందును నియమించారని, అతనే ఎమ్మెల్యే అభ్యర్థి అంటూ సభలో ప్రకటించారు. కార్యకర్తలు అభిప్రాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. నాగిరెడ్డికి ఎమ్మెల్సీ సీటు ఇస్తామని, ఆయన అడుగుజాడల్లోనే కొత్త సమన్వయకర్త చందు పనిచేస్తారని వెల్లడించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి అభిప్రాయం మేరకే కొత్త అభ్యర్థిని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కాగా గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చందుకు నియోజకవర్గంలోని ఒక వైసిపి కార్పొరేటర్ మినహా మిగతా కార్పొరేటర్లందరూ బాసటగా నిలిచారు.

మానవ అక్రమ రవాణాపై న్యాయ అవగాహన

ప్రజాశక్తి -విశాఖ లీగల్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం న్యాయసేవాసదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ పాల్గొని, హ్యూమన్ ట్రాఫికింగ్ నిరోధక చట్టం, శిక్షాస్మృతిలోని నిబంధనలు వివరించారు.

కార్యక్రమంలో డిఎస్‌పి మళ్ల మల్లేశ్వరరావు, దిశ పోలీస్‌స్టేషన్ సిఐ జి.నిర్మల, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్.మోహనలక్ష్మి మాట్లాడారు. సంబంధిత పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన హామీలన్నీ హుళక్కే

ప్రజాశక్తి- గోపాలపట్నం : సిఎం జగన్ పాదయాత్రలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధానహామీల్లో మెజార్టీ అమలులో విఫలమయ్యారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆరోపించారు. శనివారంఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మద్యనిషేధం, పేదలకు పక్కాఇళ్లు, పోలవరంప్రాజెక్టు, ఏటా రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ కేలెండర్, ఉద్యోగ, ఉపాధ్యాయుల సిపిఎస్ రద్దు, ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకే పెట్రోల్ డీజిల్, ఇలా అనేక ప్రధానహామీలేవీ అమలు చేయలేదన్నారు. టిడిపి పాలనలో ఉద్యోగులకు ఒకటో తారీఖున ఇచ్చిన వేతనాలు నెలాఖరుకు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. మూడు రాజధానుల పేరుతో విశాఖ నగరాన్ని ధ్వంసం చేశారన్నారు. అనంతరం జగన్ హామీలు పేరుతో ఏర్పాటు చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు

కస్తూర్బా విద్యార్థినుల సామర్థ్యం పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కస్తూర్బా పాఠశాలలో టెన్త్, ఇంటర్ విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్నికెజిబివి రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరావు శనివారం పరిశీలించారు. ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ ఎల్ చంద్ర కళ, ఎపిసి శ్రీనివాసరావు, జిసిడిఒ ఖలీషా బేగంలతో పాఠశాలను సందర్శించి, సబ్జెక్ట్‌ల వారీగా పురోగతిని పరిశీలించి, ఉత్తమ ర్యాంకుల సాధనకు పరీక్షలకు ఎలా సన్నద్ధమౌతున్నదీ పరిశీలించి, విద్యార్థులు, అధ్యాపకులతో విడివిడిగా సమీక్ష జరిపారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రిన్సిపల్ గంగాకుమారి పాల్గొన్నారు

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు

పద్మనాభం : ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా మండలంలోని పద్మనాభం సచివాలయంలో సర్పంచ్ టి.పాప ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కబడ్డీ, వాలీబాల్ క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సచివాలయ పరిధిలో విజేతలను మండలస్థాయికి, తర్వాత నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పాల్గొంటారని సర్పంచ్ పాప

అవంతిలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎంబిఎ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖ నగరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ బి. శ్రీ రంగాచార్యులు మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య స్వేచ్ఛాయుత, స్నేహపూరిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఫ్రెషర్స్ డే వేడుకలు దోహద పడతాయన్నారు. అవంతి రీసెర్స్ కళాశాల ప్రిన్సిపల్ గోవిందరావు, కళాశాల డైరెక్ట ర్లు డాక్టర్ ఎ చంద్ర శేఖర్, రాఘవరావు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

90 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : గుడివాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిప్పాడ , దివీస్ ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరంలో 90 మంది విద్యార్థులకు పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతిస్వామి పరీక్షలు చేశారు. ఆసుపత్రి సిబ్బందితో పాటు హెచ్‌ఎం ప్రశాంతి, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్, ఎ శ్రీనివాస్, పి శేఖర్ బాబు పాల్గొన్నారు

ఉచిత కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్‌టిఆర్ సేవాసమితి, గీతం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరంలో ఎంపిక చేసిన వారికి ఉచిత కళ్లద్దాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. శనివారం రవీంద్రనగర్ వార్డు టిడిపి కార్యాలయం వద్ద 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, సత్యనారాయణ, బలగం సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా : ఇటుకల వ్యాపారి మృతి

ప్రజాశక్తి పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీలో శనివారం ఉదయం ట్రాక్టర్ బోల్తా పడిన దుర్ఘటనలో పల్లి సూరిబాబు అనే ఇటుక వ్యాపారి మృతి చెందాడు. పద్మనాభం సిఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం, ఇటుక బట్టీల్లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రమాదం జరిగిందని, దీంతో తీవ్రంగా గాయపడిన సూరిబాబు మృత్యువాత పడినట్లు వివరించారు. అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా అర్చకుల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలబాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో కైలాసగిరి పోలీసు మైదానంలో అర్చకుల క్రికెటర్ టోర్నమెంట్‌ను ఎఆర్ డిఎస్‌పి పి.నాగేశరరావు శనివారం ప్రారంభించారు. సాంప్రదాయ దుస్తుల్లో అర్చకులు క్రికెట్ మ్యాచ్ ఆడారు. టి12 తొలిమ్యాచ్‌లో శుభ గాయత్రి జట్టుపై దుర్గా గాయత్రి జట్టు విజయం సాధించింది. టోర్నీ నిర్వహణకు ఉపకార్ స్వచ్ఛంద సంస్థ అధినేత కంచర్ల అచ్యుతరావు సహాయ సహకారాలు అందించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార: సీతంపేటలోని విటి హైస్కూల్ 77వ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పూర్వవిద్యార్థులు ఈ వేడుకలో పాల్గొని, పాఠశాల ప్రిన్సిపల్ పిఎస్ రావును ఒడి. జిల్లా వినియోగదారుల న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ ఘనంగా సత్కరించారు. హిందు పత్రిక బ్యూరో చీఫ్ సుమిత్ భట్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టి.భవాని ప్రసాద్ తదితర పూర్వ విద్యార్థులు మాట్లాడారు. అత్యున్నతస్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సత్కరించి పాఠశాల కరస్పాండెంట్ రమణరావు, హెడ్ మిస్ట్రెస్ పి.లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బిఆర్‌టిఎస్ నిర్వాసితులకు పరిహారం

ప్రజాశక్తి- సింహాచలం: బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో నిర్వాసితులకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నష్టపరిహారం చెల్లింపులో కొందరికి అన్యాయం జరిగిందనికొందరు స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యేను నిలదీశారు.స్థానిక కార్పొరేటర్ పీవీ నరసింహం పాల్గొన్నారు. అంతకుముందు సింహాద్రి అప్పన్నను ఎమ్మెల్యే ముత్తంశెట్టి దర్శించుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింహాచలం:జివిఎంసి 98వ వార్డు సాయినగర్ గోశాల లేఅవుట్‌లో రూ.52 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, తెలుగు యువత కార్యదర్శి లండ శ్రీను, మేకల కాశి, గోపాల్, పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేష్, తాలాడ రాంబాబు, పాండూరు మురళి, అవినాష్ పాల్గొన్నారు.

హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

సింహాచలం: సింహాచల ప్రాంతంలో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, హెచ్‌పిసిఎల్ డిజిఎం సుందర్ ప్రారంభించారు కార్యక్రమంలో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ సేల్స్ ఆఫీసర్ వి.పవన్‌కుమార్, గంట్ల కిరణ్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు గంట్ల శీను బాబు స్థానిక కార్పొరేటర్ పివి. నరసింహం, పాసర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత

ప్రజాశక్తి- ఆనందపురం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని భీమిలి ఎఎంసి వైస్ చైర్మన్, మాజీ ఎంపిటిసి బోని అప్పలనాయుడు ఆకాంక్షించారు. శనివారం బోని హైస్కూల్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. రెడ్డిపల్లికి చెందిన ఆసరా స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపకులు రెడ్డిపల్లి జగదీష్‌బాబు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను టెన్త్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోని అప్పలకొండ, విద్యా కమిటీ చైర్మన్ ఎర్నింటి అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, హెచ్‌ఎం ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ



యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరిస్తున్న డిఇఒచంద్రకళ

ప్రజాశక్తి - ఆరిలోవ : యుటిఎఫ్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం కేలండర్, డైరీ, పదోతరగతి మోడల్ టెస్ట్ పేపర్లను శనివారం శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఒ ఎల్.చంద్రకళ, యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేడ్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ గౌరీ శంకర్, డిసిఇబి సెక్రటరీ కృష్ణ కుమార్, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి -గాజువాక: మండలంలోని అక్కిరెడ్డిపాలెం, మింది, గాజువాక, కణితి, అగనంపూడి తదితర పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు యుటిఎఫ్ గాజువాక మండలశాఖ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. దీంతోపాటు ఉపాధ్యాయులకు డెయిరీ, కేలెండర్‌లను అందజేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహ్మద్ రిజ్వాన్, జిల్లా కౌన్సిలర్ డి.అబ్రహం లింకన్, ఎస్.విజయకుమార్, కె.అన్నపూర్ణేశ్వరి, నిడదవోలు శ్రీనివాస్ రాజు, మండల సహాధ్యక్షులు ఎండీ. అబ్దుల్ హక్, మండల ఆడిట్ కమిటీ సభ్యులు డి.నూకరాజు, ప్రసూనాంబ, కిల్లి శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు భూషణం, అంబేద్కర్, సరోజినీ దేవి, ఆశాలత, మేరీ, భవాని, బి.నాగమోహనరావు పాల్గొన్నారు.

'క్రాస్ కంట్రీ' అథ్లెటిక్స్‌లో రవి ప్రతిభ



రవిని అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపల్, కరస్పాండెంట్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన అండర్ -20 విభాగం జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలలో డి.రవి ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడని ఎస్‌బివిపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె.ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి రవిని కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌బిహెచ్ రాజేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. క్రాస్ కంట్రీ రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరచాలని కళాశాల డైరెక్టర్ రాహుల్ అశ్వానిదాస్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆదిరెడ్డి, కళాశాల కో-ఆర్డినేటర్ జివిఎస్ భగవాన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

'భాస్కర్ విద్యానికేతన్' కేలండర్ ఆవిష్కరణ



కేలెండర్ ఆవిష్కరిస్తున్న స్కూల్ డైరెక్టర్ భాస్కర్

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో 2024 పాఠశాల కేలెండర్ ను శనివారం స్కూల్ డైరెక్టర్ భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామస్తులకు కేలెండర్‌ను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పి.రమాదేవి,ఉపాధ్యాయులు సునీత, రాణి, తల్లిదండ్రులు మదీన, వరలక్ష్మి, సంధ్య, గౌసీ బేగం,లక్ష్మి పాల్గొన్నారు..

మున్సిపల్ సమ్మె ఉద్రిక్తం

- ఎక్కడికక్కడే చెత్త వాహనాలను అడ్డుకున్న కార్మికులు
- జిపిఎంసి పరిధిలో 300 మంది కార్మికుల అరెస్టు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ... వంటావార్పు నిరసనలు



పెందుర్తిలో చెత్త వాహనాలను అడ్డుకుంటున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల సమ్మెలో ఐదవ రోజు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేటు డ్రైవర్లను పెట్టి వాహనాలను తీయడంతో పలుచోట్ల మున్సిపల్ కార్మికులు అభ్యంతరాలు తెలిపి, అడ్డగించారు. దీంతో ఎక్కడకక్కడ పోలీసులు మోహరించి కార్మికులను అరెస్టులు చేశారు. జివిఎంసి పరిధిలో 8 జోన్లు ఉండగా, అన్నిచోట్ల కలిపి 300 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి. వెంకటరెడ్డి తెలిపారు. కొన్నిచోట్ల పోలీసులు కార్మికులపై లాఠీచార్జి చేశారని, కార్మికులు టి.గంగమ్మ, చంద్రమ్మ గాయపడి స్పృహతప్పి పడిపోతే వారిలో ఒకరిని కెజిహెచ్‌కు, మరొకరిని విమ్స్ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. 5వ రోజు జివిఎంసిలో మున్సిపల్ సమ్మెలో 6,300 మంది మున్సిపల్ కార్మికులు (పారిశుధ్య, మలేరియా, వెటర్నరీ, డ్రైవర్లు, క్లాప్ డ్రైవర్లు, యుజిడి వర్కర్స్) సమ్మెలో ఉన్నారని వివరించారు. సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఖండించారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సూయజ్ ఫారం వద్ద 50 మంది అరెస్ట్

విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ వర్కర్లు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 5వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా 4వ జోన్ టౌన్ కొత్త రోడ్డు సమీపంలోని సూయజ్ ఫారం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు టి.నూకరాజు నాయకత్వంలో సమ్మె శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వాహనాలను ప్రైవేటు డ్రైవర్లతో జివిఎంసి అధికారులు బయటకు తీయిస్తున్న సందర్భంలో మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. అప్పటికే మోహరించిన పోలీసులు కార్మికులను నిరోధించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో కార్మికులకు పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. కార్మికులు వెనకకు తగ్గని కారణంగా పోలీసులు లాఠీచార్జి చేశారు. పలువురు గాయపడ్డారు. ఇద్దరు మహిళా కార్మికులు స్పృహ తప్పి పడిపోయారు. సుమారు 50 మందిని పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ స్టేషన్‌కు తరలించారు.

పెందుర్తి :95వ వార్డు చీమలాపల్లి డంపింగ్ యార్డ్ వద్ద చెత్త వాహనాలను నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. పోలీసుల దగ్గరుండి వాహనాలను పంపడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన కార్మికులు, వారిని అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఇలా భయపెట్టి పనులు చేయించ డంపై కార్మికులు ఆవేదన, అసహనం వ్యక్తం చేశారు.

మధురవాడ : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా మారికవలస వద్ద వంటావార్పు నిర్వహించారు. ఐదోవార్డు మారికవలస, ఎనిమిదోవార్డు వుడా కాలనీలో వేరే కార్మికులు పనిచేస్తుండగా వారిని అడ్డుకున్న 12మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, పిఎంపాలెం స్టేషన్‌కు తరలించి, తర్వాత విడిచి పెట్టారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, దొడ్డిదారిన పారిశుధ్య పనులు చేయిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ చెత్తలకు కాపలా కాశారు. వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో బి నర్సింగరావు, జికిరణ్, పి.జాన్, ఎం సుశీలమ్మ, కె.లక్ష్మి, బి.వరలక్ష్మి కె అచ్చయ్యమ్మ. పాల్గొన్నారు



మధురవాడలో వంటావార్పు నిరసన

భీమునిపట్నం : భీమిలి ఒకటో జోన్ పారిశుధ్య కార్మికులు స్థానిక రెల్లివీధి వద్ద వంటావార్పు నిర్వహించారు. జివిఎ సి ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి జోన్ కమిటీ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ప్రధాన కార్యదర్శి రవ్వ నరసింగరావు, నాయకులు సురేష్, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు

ములగాడ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె ఆగదని, నిరసన తెలిపిన కార్మికులను, నేతలనుఅరెస్ట్ చేయడం దుర్మార్గమని సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ఖండించారు. గాజువాక, స్టీల్ ప్లాంట్ మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లకు కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, పైడిరాజు, నాయుకులు కె.రమణ, బి.రాంబాబు, సూరిబాబు, మురళీ గొల్లబాబు, డి.రాము, ఆదినారాయణ, భీముడు దుర్గా, రాజేశ్వరి, లక్ష్మి దేవి, లలిత. పాప, భూలోకదుర్గ, రవణమ్మ. అప్పలకొండ. ఉమ, విజయ, మీనా, సంతోషి, సూరమ్మ పాల్గొన్నారు.

పిఎం పాలెం: మున్సిపల్ కార్మికుల సమ్మెకు టిడిపి, జనసేన పార్టీ నేతలు సంఘీభావం తెలిపాయి. తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్, రెడ్డి సత్యన్నారాయణ, జనసేన నాయకులు సంతోష్ నాయుడు సమ్మెశిబిరాన్ని సందర్శించారు. సిఐటియు మధురవాడ జోన్ కమిటీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళా కార్మికురాలికి గాయాలు

ఆరిలోవ: మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 9, 10, 11, 12, 13 వార్డుల పారిశుధ్య కార్మికులు శనివారం తెల్లవారు జామున ఆరిలోవ కాలనీ, ఎంఎస్ఎఫ్ వద్దకు చేరుకొని ఆందోళన కొనసాగించారు. చెత్తను సేకరించే వాహనాలను బయటకు రాకుండా అడ్డుకోవడంతో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. వాహనాలు అడ్డంగా ఉన్న పారిశుధ్య కార్మికులను బలవంతంగా పోలీసు వ్యాన్ ఎక్కించారు. ఈ క్రమంలో మహిళా కార్మికురాలికి గాయం కాగా, విమ్స్ ఆసుపత్రికి తీసుకు వెళ్ళి చికిత్స అందిస్తున్నారు.



పోలీసుల అదుపులో గాజువాక సిపిఎం నేత రాంబాబు

గాజువాక: పారిశుధ్య కార్మికుల సమ్మె విచ్ఛిన్నం చేయాలని ప్రభుత్వం, అధికారులు కుట్ర పన్నుతున్నారని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు విమర్శించారు. శనివారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు తనతోపాటు గొలగాన అప్పారావు, గణేష్, కె.అప్పల రాజు, మరికొందరు కార్మికులను అరెస్టు చేసి. వివిధ స్టేషనులకు తరలించ డంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర యూనియన్ల కార్మికులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అధికారులతో పారిశుధ్య పనులు చేయించాలని భావించి, వారిని అడ్డుకోకుండా ఉండేందుకు ఇలా నిర్బంధాలు, అరెస్టులకు గురిచేయడం సరికాదన్నారు. అరెస్టులతో సమ్మెను విచ్ఛిన్నం చేయలేరని స్పష్టం చేశారు. .

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న నిరసన

అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె ఐదవరోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం ముందు చెవిలో పువ్వులు పెట్టికొని ఆర్ధనగ్నంగా నిరసన తెలపారు. ఇప్పటి వరకు క్యాబ్ డ్రైవర్లు మాత్రమే సమ్మెలో పాల్గొనగా, శనివారం నుంచి పెద్ద లారీలు, ట్రాక్టర్ డ్రైవర్ కూడా సమ్మెలో పాల్గొన్నారు. దీనితో పట్టణంలో చెత్త ఎక్కడిక్కడ పేరుకు పోవడంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. సందర్భంగా సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా టెంట్ ముందు నుంచి వెళ్లే సమయంలో కార్మికుల సమస్యలు గురించి చెబుదామని ప్రయత్నం చేసినా ఆగకుండా వెళ్ళి పోవడాన్ని ఖండించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకరరావు, జి.సత్యనారాయణ, బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్, నూకరాజు , శివకుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

మున్సిపల్ సమ్మెను విచ్ఛిన్నం చేసే చర్యలు విడనాడాలి

కౌన్సిల్‌ను సమావేశపరచాలి : జివిఎంసి మేయర్‌కు గంగారావు వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న గంగారావు

ప్రజాశక్తి-విశాఖపట్నం : కార్మిక సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రయత్నించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వెంటనే జివిఎంసి కౌన్సిల్‌ను సమావేశ పరచాలని కోరుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు శనివారం వినతిపత్రం అందించారు. ఐదు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారని, అందులో భాగంగా జివిఎంసిలో ఉన్న ఆరు వేలమంది కూడా సమ్మెలో ఉన్నారని తెలిపారు. వీరి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోగా సమ్మెను విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పోటీ కార్మికులను తీసుకొస్తున్నారని, వార్డు సచివాలయ ఉద్యోగులను, వాలంటీర్లను, స్వయం సహాయక బృందాల ఆర్‌పిలను బెదిరించి పారిశుధ్య పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రులు సిఐటియు మున్సిపల్ యూనియన్ నాయకులను పోలీసుల ద్వారా అరెస్టులు చేపిస్తున్నారని వివరించారు. జోన్- 5 సూయజ్ ఫారం వద్ద శనివారం కార్మికులపై పోలీసులు చేసిన లాఠీ ఛార్జిలో ఇద్దరు కార్మికులు గాయాలపాలయ్యారని తెలిపారు. వార్డులలో నిరసన తెలుపుతున్న కార్మికులను సైతం అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారని వివరించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో కార్మికులను నిర్బంధించారని, వాహనాలను బలవంతంగా తీయిస్తున్నారని, ఇవన్నీ నియంతృత్వ, చట్ట వ్యతిరేక చర్యలు అని పేర్కొన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన వాటిని పరిష్కారం చేయక పోగా కార్మికులను అణిచివేసే చర్యలకు పూనుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. కార్మికులపై వెంటనే నిర్బంధం ఆపి సమాన పనికి సమాన వేతనం, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్, కనీసం రూ.26వేలు ప్రకటించాలని, హెల్త్ అలవెన్స్ అందరికీ ఇవ్వాలన్న డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నగరంలో కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని, ఈ మేరకు వెంటనే జివిఎంసి కౌన్సిల్ సమావేశం జరిపి పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంపై తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు.

తగ్గిన రహదారి ప్రమాదాలు

- హత్యల్లో స్వల్ప పెరుగుదల
- గంజాయి రవాణా నియంత్రణకు పటిష్ట వ్యవస్థ
- మొబైల్ ఫోన్ల రికవరీలో అగ్రస్థానం
- చోరీలు కట్టడికి ఎల్‌హెచ్‌ఎంఎస్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో నేర నియంత్రణ, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, సమర్ధవంతమైన పోలీసు సేవలతో కొన్ని ఫలితాలు సాధించింది. భద్రతా చర్యల్లో భాగంగా రహదారి ప్రమాదాలు తగ్గించేందుకు 39 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి స్టాప్ బోర్డులు, సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ఈ ఏడాది ప్రమాద కేసులు తగ్గాయి. 2022లో జరిగిన రోడ్ ప్రమాదాల్లో 725 కేసుల్లో 339 మంది మృతి చెందగా, ఈ ఏడాది నమోదైన 685 కేసుల్లో 294 మంది మరణించారు. మొబైల్ ఫోన్లు రికవరీ కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందించి, రూ.2.20 కోట్ల విలువైన 1238 మొబైల్ ఫోన్లను వేర్వేరు ప్రాంతాల నుంచి రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. దొంగతనాల నివారణకు లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) సదుపాయం అమల్లోకి తెచ్చారు. సైబర్ నేరాలు 2022లో 59 నమోదుకాగా, 2023లో 57 నమోదయ్యాయి. సైబర్ మోసాల తీరుపై మహిళా పోలీసులు ఇళ్లకు వెళ్లి జనాలకు అవగాహన కల్పించడంతో నేరాల సంఖ్య కాస్త తగ్గింది. కోటీ 46 లక్షల విలువైన గ్రేవ్ ప్రాపర్టీ చోరీలో రూ.76.66 లక్షల విలువైన ఆస్తులు రికవరీ చేయగలిగారు. కోటీ 89 లక్షల విలువైన ఆస్తి సంబంధిత చోరీలో రూ.66.56 లక్షల ఆస్తులను స్వాధీనం చేశారు. నాటుసారా నిర్మూలనలో పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా చేసిన కృషితో 1378 కేసులు నమోదుచేసి 5,906 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 1.76 లక్షల లీటర్ల పులుపు బెల్లం ధ్వంసం చేసి 1119 మందిని అరెస్టు చేశారు. బెల్ట్ షాపుల నుంచి 767 లీటర్ల మద్యం, 124 లీటర్ల బీరు స్వాధీనం చేసుకొని 632 కేసులు నమోదు చేసి 653 మందిని అరెస్టు చేశారు. 2023లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై 5,733 కేసులు నమోదు చేసి కోటి 12 లక్షలు జరిమానా వసూలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 16,152 మందిపై కేసులు పెట్టడంతో కోర్టు రూ.17.55 లక్షలు జరిమానా విధించింది. ఈ ఏడాది హత్యల నమోదు పెరిగింది. 2022లో 15 హత్యలు నమోదుకాగా, 2023లో డిసెంబరు చివరి నాటికి 25కు పెరిగాయి. వీటిలో వివాహేతర సంబంధ హత్యలు ఎక్కువగా వున్నాయి. హత్యాయత్నం కేసులు 30 నుంచి 33కు పెరిగాయి.

జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా చేసే క్రమంలో గంజాయి అక్రమ రవాణా మార్గాలను అరికట్టేందుకు నాలుగు శాశ్వత చెక్ పోస్టులు, 11 డైనమిక్ చెక్ పోస్టుల వద్ద సిసిటివి కెమెరాలు అమర్చి జిల్లా కేంద్రంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. ఈ తరహా నేరాలకు పాల్పడిన 16 మండలాల్లోని 63 గ్రామాలను గుర్తించి మండల, గ్రామ స్థాయి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. గంజాయి రవాణాతో సంబంధమున్న 562 మందిని అరెస్టు చేసి, 7,890 కిలోల గంజాయి, 23 లీటర్ల హషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు.

నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా : ఎస్‌పి మురళీకృష్ణ

జిల్లాలో నేర నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ, చర్యలు తీసుకున్నట్లు ఎస్‌పి కెవి మురళీకృష్ణ తెలిపారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌పై మొబైల్ ప్రచార రథం ద్వారా కళాశాల, పాఠశాల విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు పోలీసు సిబ్బంది మెరుగైన పనితీరు, సేవలతో కొన్ని మంచి ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. శనివారం ఎస్‌పి కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీలు బి.విజయ్ భాస్కర్, పి.సత్యనారాయణరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఏడాది నేర నమోదు, ఫలితాల వివరాలను ఎస్పీ వెల్లడించారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 2.17 లక్షల మంది మహిళలతో దిశా యాప్ రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. 1570 స్పందన, 266 సిసిసి పిటిషన్‌లు కాలపరిమితిలో పరిష్కరించామన్నారు. 100, 112, దిశా కాల్స్‌పై సకాలంలో స్పందించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసు సిబ్బంది, సంక్షేమ చర్యల్లో భాగంగా కారుణ్య నియామకాలు, ఉచిత మెడికల్ క్యాంపులు వంటివి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పరవాడ డిఎస్పీ కెవి సత్యనారాయణ, డిఎస్ఆర్‌బి ఇనస్పెక్టర్ ఎస్.లక్ష్మణమూర్తి, ఐటి కోర్ ఎస్ఐ ఎం.రఘువర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొమ్మోజు



ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్.టి.ఐ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ చట్టపరంగా ఉద్యమం చేస్తున్న ప్రజా సంకల్ప వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అనకాపల్లి ప్రాంతానికి చెందిన విద్యావేత్త కొమ్మోజు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రముఖ న్యాయవాది మధురై రంగసాయిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలో ఈ బాధ్యతకు సంబంధించి అధికారిక పత్రాలను పోస్ట్ ద్వారా అందజేస్తామన్నారు. కొమ్మోజు రమేష్ ఆర్టిఐ చట్టంపై అవగాహన కలిగి ఉండి ఆర్టిఐ చట్టం-2005 ద్వారా పలు సమస్యలు పరిష్కరించడం వలన రాష్ట్ర ఉపాధ్యక్ష భాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు అధ్యక్షులు రంగ సాయి రెడ్డికి, పవర్ అఫ్ ఆర్టిఐ ఎడిటర్ పట్నాల సాయికుమార్‌కు రమేష్ ధన్యవాదాలు తెలియజేశారు. కొమ్మోరు రమేష్ నియామకం పట్ల అనకాపల్లి జాఫ్ గౌరవ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది సాయిరాం, జాఫ్ అధ్యక్షులు దాడి వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలంటే క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉన్నతస్థానాలకు ఎదగాలంటే చదువుతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని దాడి విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక దాడి వీరునాయుడు కళాశాల (డీవీఎన్) విద్యార్థుల "యంగ్ బీట్స్" పేరిట న్యూఇయర్ హంగామా వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఈ వేడులను దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు కేక్ కట్ చేసి ప్రారంభించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నృత్య ప్రదర్శనలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. ఈ మేరకు అకడమిక్ ఇయర్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు శాలువాలతో సత్కరించి మెమోంటో, నగదు బహుమతులు అందజేశారు. డీవీఎన్ కళాశాలలో చదివే విద్యార్థులకు మేనేజ్‌మెంట్ అందిస్తున్న ప్రోత్సాహం, తోడ్పాటు మరువలేనివని తల్లిదండ్రులు, విద్యార్థులు కొనియాడారు. గత ఏడాది జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ వచ్చే నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధిస్తూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఉద్యోగం సంపాదించడమే ధ్యేయంగా కాకుండా మనమే పదిమంది ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.దయామాధురి, కళాశాల లెక్చరర్స్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కేలండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సంఘం ముద్రించిన డైరీ, కేలండర్లను అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శనివారం డిఇఒ ఎం.వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైరీలో ఉపాధ్యాయులకు ఉపయోగపడే మంచి సమాచారాన్ని పొందుపరచటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి ఎ.రవిబాబు, మోనిటరింగ్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు, చైతన్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి నడిగట్ల శేషుకుమార్, అనకాపల్లి మండల నాయకులు దేముడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 41 మంది 10వ తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దేవుపల్లి నరసింహమూర్తి, ఉపాధ్యాయులు రెడ్డి శేషు, ఎల్‌వి.నారాయణ రావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున్, సభ్యులు సింగంపల్లి రామారావు, రెడ్డి రఘు, మురళి పాల్గొన్నారు.

సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం, మేడచర్ల, ఎ.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో 10వ తరగతి విద్యార్థులకు సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆర్.నాగేశ్వరరావు, శివానంద, కె.నాగేశ్వరరావు, సిరి ఫౌండేషన్ ట్రస్టీస్ ఎల్‌వి.నారాయణరావు, సూరెడ్డి బాబూరావు, ఉపాధ్యాయులు దొగ్గ ఎరుకు నాయుడు, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, పాల్గొన్నారు.

క్రీడలతో రాజకీయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి క్రీడలను రాజకీయం చేస్తూ ఆడుదాం ఆంధ్ర పేరుతో కొత్త రకం ఎన్నికల వ్యూహానికి దిగారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక రింగ్ రోడ్ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో నాగ జగదీష్ మాట్లాడారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఖర్చుతో నిర్వహిస్తున్న గడపగడపకు, జగనన్నకి చెబుదాం, బస్సుయాత్ర, నేను ఉన్నాను, ఆడదాం ఆంధ్ర కార్యక్రమాలు అట్టర్ ప్లాప్ అయ్యాయని పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా క్యాసినోలు, పేకాట క్లబ్బులు, కోడిపందాలు, బెట్టింగులకు ఇచ్చిన ప్రోత్సాహం వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్యవంతమైన క్రీడలకు ఇచ్చి ఉంటే జాతీయస్థాయిలో క్రీడాకారులు వచ్చి ఉండేవారని పేర్కొన్నారు. నాలుగున్నర సంవత్సరాలు పట్టించుకోకుండా ఇప్పుడు ఆడుదాం ఆంధ్రా ద్వారా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారవుతారంటూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించిన రీతిలో ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు శివన్నారాయణ, కోట్ని రామకృష్ణ, ధనాల విష్ణు చౌదరి, మారిశెట్టి శంకర్రావు, కుప్పిలి జగన్, బుద్ధ భువనేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్

పేదల పక్షపాతి ప్రజాశక్తి

కేలండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే అదీప్ రాజ్

ప్రజాశక్తి - పరవాడ

ప్రజాశక్తి దినపత్రిక పేదల పక్షపాత పత్రిక అని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన 2024 నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం పరవాడ వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పిటిసి పిఎస్.రాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, మండల సచివాలయాల కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకారావు, పిఎసిఎస్ చైర్మన్ బురద అప్పలరాజు, వైసిపి నాయకులు అంజిరెడ్డి, పరవాడ ఉపసర్పంచ్ బండ రామారావు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైసిపి నాయకులు

ప్రజా సమస్యలపై అప్రమత్తం చేసే పత్రిక

అనకాపల్లి : ప్రజాశక్తి ప్రచురించిన 2024 అనకాపల్లి కేలండర్‌ను స్థానిక మండల పరిషత్ అభివద్ధి కార్యాలయం వద్ద ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులను, ప్రజా ప్రతినిధులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే పత్రిక ప్రజాశక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి ధర్మారావు, తుమ్మపాల ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి చంటి, కోడూరు, వెంకుపాలెం, అచ్చయ్య పేట సర్పంచ్‌లు సేనాపతి శ్రీనివాసరావు, రాపేటి నాగేశ్వరరావు, బాదపు తాతారావు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి సూరిబాబు, వైసిపి నేత గోవింద

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి
రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద 11వ రోజు నిరసన శిబిరాన్ని శనివారం యుటిఎఫ్, పిఆర్‌టియు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. శ్రీలక్ష్మి, ఏపీటీఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు పట్టా కృష్ణ, పూడి వెంకట్రావు, గొట్టేటి నాగేశ్వరరావు, అచ్యుత, కృష్ణ, సతీష్, నూకేశ్వరరావు పాల్గొన్నారు.

'సర్వ శిక్ష' ఉద్యోగుల పొర్లుదండాలు

విశాఖ కలెక్టరేట్ : సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెలో భాగంగా 11వ రోజైన శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొర్లు దండాలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఎపి సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ అధ్యక్షుడు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య మాట్లాడుతూ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న దృశ్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బత్తుల తాతయ్యబాబు తదితరులు

చంద్రబాబు పాలనతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు అన్నారు. మండలంలోని గంటి కోర్లం గ్రామంలో శనివారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ సాయం శేషు, ఎస్ శ్రీరామ్మూర్తి, గొన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిసిలను ఓటు బ్యాంకుగా చూస్తున్న పార్టీలు

ప్రజాశక్తి -మునగపాక : ఇటు ప్రాంతీయ పార్టీలు, అటు జాతీయ పార్టీలు బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని రాహుల్ గాంధీ ప్రకటించడం చూస్తే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ప్రకటన చేసినట్లు ఉందని అభిప్రాయ పడ్డారు. నిజంగా కూటమికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో తమ నాయకుడు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కి మద్దతు తెలిపి కేంద్రంపై పోరాడాలని కోరారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దళితుల సమస్యలు సత్వరమే పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తాసిల్దార్ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్సీ ఎస్టీ చట్టాలు, పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ దళితుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమగ్ర భూ సర్వేలో భాగంగా అర్హులైన దళితులందరికీ సాగు హక్కు పట్టాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కె.వి రమణ, కాటపల్లి అప్పారావు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ , ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, సోషల్ వెల్ఫేర్ ప్రతినిధి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సరిహద్దులు గుర్తించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ప్రభుత్వ భూముల సరిహద్దులను గుర్తించి కాపాడే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని సీనియర్ జనసేన నాయకుడు బలిరెడ్డి అప్పారావు కోరారు. సబ్బవరంలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనవరి నెల అంతా పండగల హడావిడి కావడంతో అధికారులు వివిధ సెలవులపై వెళ్లడం వలన ఇదే ఆసరాగా చూసుకొని కొంతమంది ఆక్రమణదారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసే పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. సబ్బవరం సర్వే నెంబరు 271కి చెందిన అధికారిక భూమి ఎటువంటి పత్రాలు లేకుండా కబ్జాలు చేసి కొంతమంది విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. 272 డి.పట్టా భూమిని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 271 ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని, దీనిపై రెవెన్యూ సిబ్బంది స్పందించి సర్వే నెంబరు 272 భూసరిహద్దులు గుర్తించేయాలని కోరారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం అగనంపూడి హోమీబాబా కేన్సర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ తరుణ్ ఆధ్వర్యంలోని బందం అన్ని రకాల కాన్సర్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల, మెడ, ఊపిరితిత్తుల క్యాన్సర్లు పురుషుల్లోనూ, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్లు మహిళల్లోనూ ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ఏం చేయాలి అనే దానిపై పలు సూచనలు చేశారు. అనంతరం 45 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునగపాక వైద్యాధికారి డాక్టర్ నంది విమలగిరి, ఎంఎల్‌హెచ్ పి ఉమా చంద్రిక, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశా జ్యోతి పాల్గొన్నారు.

'నాన్ షెడ్యూల్డ్' గిరిజనులకు డిప్యూటీ సీఎం ద్రోహం

ఐదో షెడ్యూల్‌లో చేర్చడాన్ని అడ్డుకున్న బూడి, చోడవరం, నర్సీపట్నం ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-దేవరాపల్లి
అనకాపల్లి జిల్లాలోని నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాలను రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో చేర్చే ప్రతిపాదనలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, చోడవరం, నర్సీపట్నం ఎమ్మెల్యేలు అడ్డుకున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన గిరిజన గ్రామాల జాబితాలను ఏడాది క్రితం అడగ్గా, దీనిపై తహశీల్దార్లు సంబంధిత గిరిజన గ్రామాల జాబితాలు తయారు చేసి పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి అప్పట్లోనే పంపించినట్లు తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు, చోడవరం నర్సీపట్నం ఎమ్మెల్యేల అభిప్రాయాలు కోరగా..., ఇప్పటికే నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలన్నీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని, పైగా భూస్వాములు నుండి తమకు సమస్యలొస్తాయని చెప్పి ఆ ప్రతిపాదనల జాబితాలను పంపించవద్దని అడ్డుపడ్డారని తెలిపారు. వీరి చర్యలు చారిత్రాత్మక తప్పిదమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు గడిచినా నేటికీ నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజనులు కనీస వసతులకు నోచుకోలేదని, పేరుకే గిరిజనులుగా బతుకుతున్నా వీరికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ, 1/70 వంటి గిరిజన చట్టాలు అమల్లోనూ నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గ్రామాలకు రహదారుల్లేక నేటికీ డోలిమోతలు తప్పడం లేదన్నారు. చేతిలో బెల్లం పెట్టి, ముక్కుపుల్ల లాక్కున్న చందంగా నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజనుల పట్ల డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకొని నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, జిల్లాలోని గిరిజనులకు ఐఎఎస్ అధికారితో కూడిన ఐటిడిఎను ఏర్పాటు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు. లేకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.

ల్యాండ్ పూలింగ్ బాధిత రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మండలంలోని పైడివాడ అగ్రహారం, పైడివాడ, ఎరుకునాయుడు పాలెం రెవెన్యూల పరిధిలో ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి నాయకులు గండి రవికుమార్ ఆధ్వర్యాన బాధిత రైతులు శనివారం అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండారు, గండి మాట్లాడుతూ ఈ మూడు రెవెన్యూల పరిధిలో ఒకే చోట సుమారు 320.83 ఎకరాల భూములను రైతులు ఇచ్చారని, వారికి బీటీ రోడ్లు, విద్యుత్ సదుపాయం, డ్రైనేజ్ వ్యవస్థ కూడిన నివాసాలకు అనుకూలంగా ఉండే డెవలప్మెంట్ చేసిన ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చి గుర్తు చేశారు. అందుకే అప్పట్లో రైతులు భూముల్లో ఉన్న ఫలసాయానికి నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. రైతుల నుండి భూములు తీసుకొని మూడేళ్లు గడిచినా నేటికీ రైతులకు డెవలప్ చేసిన స్థలాలు అప్పగించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకొని ల్యాండ్ పూలింగ్ బాధిత రైతులకు వివిఎంఆర్‌డిఎ డెవలప్మెంట్ చేసిన ప్లాట్లతో పాటు రిజిస్ట్రేషన్ చేసి, ఆ స్థలాల్లో హౌసింగ్ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో నిర్మాణాలు జరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పైడివాడ అగ్రహారం ఎంపిటిసి సీరం అప్పలరాజు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, మాజీ ఎంపిటిసి అక్కిరెడ్డి దుర్గి నాయుడు, గొల్లలపాలెం, పెదముషిడివాడ రైతులు పాల్గొన్నారు.

5న మిడ్డేమీల్స్ ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అనకాపల్లి : మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సమస్యలపై విజయవాడలో 2024 జనవరి 5వ తేదీన జరుగు రాష్ట్ర ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి వరలక్ష్మి పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా సిఐటియు ఆఫీసులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 9, 10 తరగతులకు వంట చేస్తున్న కార్మికులకు వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని, స్కూల్ విలీనం పేరుతో తొలగించిన కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు అరికట్టాలని తదితర డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఈ కార్యక్రమంలో ఎస్‌కె బీబీ, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి - పరవాడ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను శనివారం పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పిటిసి పైల సన్యాసిరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా ముద్రించిన వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు నాయకులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం 85 శాతం విఫలం


ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 85 శాతం విఫలమైందని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని టిడిపి మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లునాయుడు అన్నారు. చోడవరంలో శనివారం వాళ విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.3000కు పెంచుతామని చెప్పి అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్ల తర్వాత రూ.3000కు పెంచడం శోచనీయమన్నారు. విచ్ఛిన్నమైన పాలనతో పాటు రోడ్లు దుస్థితి జగన్మోహన్ రెడ్డి పనితనానికి అర్థం పడుతుందన్నారు. సంక్షేమం అభివృద్ధి పాలన చేసిన చంద్రబాబు రాష్ట్రానికి అవసరమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు భూతనాథ నని కుమార్, దేవరపల్లి వెంకట అప్పారావు, మల్లి బాబు పాల్గొన్నారు.

సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఫ్యూజన్ వేడుకలు

ప్రజాశక్తి- పరవాడ : స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నాట్యం, గీతం, సంగీతం, చిత్రలేఖనం, కృత్రిమ మేధ వంటి అంశాల సమ్మేళనంతో ఫ్యూజన్ అనే ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. చిన్నారులు కౌబోయ్, కాశ్మీరీ, రాజస్థానీ, తిల్లానా వంటి నృత్య ప్రదర్శన చేశారు. రైతుల స్థితి గతులు గురించి ప్రదర్శించిన నృత్యం చూపరుల హృదయ చలనమైనది. చిన్నారులు వినిపించిన గేయాలు ఎన్నో కనిపించని గాయాలనూ ప్రతి రూపాలుగా నిలిచాయి. మనసులో భావాలకు మాటల రూపమా అన్నట్టు ఉండగా చిత్రలేఖనం జీవకళ ఉట్టిపడేలా అలరించింది. కృత్రిమ మేధ, హెల్త్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టులు కూడా విద్యార్థి తల్లిదండ్రుల మెప్పుపొందాయి. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈఓ, కె. నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, డాన్స్, ఆర్ట్ మాస్టర్ జ్యోతిర్మయి, ఎమ్.శంకర్, పాఠశాలలో డైరెక్టర్ పి. ఉదయనాగశ్రీ పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన లంకవానిపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : తమ గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంపై మండలంలోని లంకవానిపాలెం గ్రామస్తులు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు లంకవానిపాలెం గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు ఆధ్వర్యాన గ్రామస్తులు పెద్ద ఎత్తున శనివారం ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ గ్రామంలో రూ.20 లక్షలతో వాటర్ ప్లాంట్ నిర్మాణం, రూ.20 లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు, కోటి 67 లక్షల రూపాయలతో ఆసుపత్రి భవనాలు, రూ.20 లక్షలతో సిసి రోడ్లు, ఐదు లక్షలతో కాలువల నిర్మాణం, పాఠశాల భవనాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేసినట్లు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేసిన మంత్రికి గ్రామస్తులు అండగా నిలబడతారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఈర్లే అనురాధ, ఎంపిపి రెడ్డిజగన్మోహన్ పాల్గొన్నారు.



బూడి ముత్యాలనాయుడును కలిసిన గ్రామస్తులు

సచివాలయాల వద్ద ఆందోళనలు

-19 వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె


నక్కపల్లిలో మద్దతు తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె శనివారం 19వ రోజుకు చేరింది. సచివాలయాల వద్ద అంగన్‌వాడీలు ఆందోళనలు చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

నక్కపల్లి: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా శనివారం మండలంలో పలు సచివాలయాల వద్ద అంగన్వాడి వర్కర్స్ పంచాయతీ కార్యదర్శులకు తమకు సహకరించాలని కోరుతూ విజ్ఞప్తి పత్రాలను అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు.ఉపమాకలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, టిడిపి శ్రేణులు కొప్పిశెట్టి బుజ్జి, సూర్యనారాయణ, శ్రీను, వాసు, దొరబాబు, వెంకటేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపారు. న్యాయం పూడిలో జనసేన నేత ఆకేటి గోవిందరావు సంఘీభావం ప్రకటించారు.

చీడికాడ :మండల కేంద్రంలో చావిడి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, డివిజన్ కార్యదర్శి కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు మాట్లాడుతూ, ఐసిడిఎస్‌ను పటిష్ట పర్చాలని, నాణ్యమైన సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట నాయకులు ఎం.జానకి. రామలక్ష్మి. రాజులమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి వినతి

నర్సీపట్నం టౌన్:సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. శనివారం సాధికార బస్సు యాత్ర నేపథ్యంలో ఆయన నర్సీపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఆయన్ను కలిసి సమస్యలను వివరించారు.


కోటవురట్ల:మండలంలో పలు సచివాలయాల వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసనలు చేపట్టి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యవర్గ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదన్నారు.

యస్ రాయవరం:మండలంలోని పి.ధర్మవరంలో గ్రామ సచివాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. గ్రామ కార్యదర్శి వెంకట రమణ, విఆర్ఓ సూరిబాబు లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, గ్రామ ఉపసర్పంచ్ కలిగట్ల మాణిక్యం, అంగన్వాడీ టీచర్లు వి.లక్ష్మి, జోగలక్ష్మి, పాల్గొన్నారు.

వడ్డాది: పస్తులతో రోడ్లపై ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు సిఎం జగన్‌కు కనబడలేదని ఉత్తరాంధ్ర చర్చ వేదిక కన్వీనర్ అడపా నరసింహమూర్తి ప్రశ్నించారు. బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది సచివాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి లోవరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రేమ్‌చంద్రశేఖర, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సాంబశివరాలు, యూనియన్ నేతలు అమ్మాజి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలో మూడు సచివాలయ సెక్రెటరీ అధికారులకు వినతి పత్రాలు అందజేసి ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి మాడుగుల ప్రాజెక్ట యూనియన్ నాయకులు ఆర్.రామలక్ష్మి, డి.పార్వతి, వి ధనలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు, దేముడు నాయుడు, ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి పాల్గొని మద్దతు తెలిపారు.

మునగపాక:మండల కేంద్రం మునగపాక సచివాలయాల వద్ద అంగన్వాడీలు శనివారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, యూనియన్ నాయకులు హేమలత, సరస్వతి, శివగణేష్ అమ్మ పాల్గొన్నారు. మండలంలోని వెంకటాపురం సచివాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో సుబ్బారెడ్డి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కశింకోట : కసింకోట గ్రామ సచివాలయాలు (ఒకటి, రెండు, మూడు, నాలుగు) ఎదుట అంగన్వాడీలు శనివారం ధర్నా చేశారు. అనంతరం సచివాలయ అధికారి కిషోర్, ఈఓర్డ్ రమేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తనుజ, శ్యామల, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండలంలోని సుందరయ్య పేట, భీమవరంలో వినతిపత్రాలు అందజేశారు.

చోడవరం : అంగన్వాడి కార్యకర్తలు రిలే దీక్షలో భాగంగా చోడవరం సచివాలయ పంచాయతీ ఈవో నారాయణరావుకు వినతిపత్రం అందించారు. సిఐటియు నేత నాయుడు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వాడు చీపురుపల్లి, పరవాడ, ఈ బోనంగి, కలపాక, లంకెలపాలెం, పెద్దముషిడివాడ, మంత్రి పాలెం, మత్రిపాలెం, ఫార్మాసిటీ కాలనీ, తానాం, భరణం, దేశపాత్రునిపాలెం సచివాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. యూనియన్ నాయకురాలు అమ్మాజీ, సిహెచ్ దేవి, పార్వతి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద 19వ రోజు అంగన్వాడీలు సమ్మెలో భాగంగా ఆందోళన చేసి సచివాలయ సిబ్బందికి వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, జి దేవుడు నాయుడు, యూనియన్ నాయకులు సుజాత, లక్ష్మీ, శేషారత్నం, కుమారి పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి అర్బన్ సచివాలయాలు, మండలంలోని వివిధ సచివాలయాల్లో అంగన్వాడీలు శనివారం వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ నాయకులు ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.


బుచ్చయ్యపేటలో ...

కె.కోటపాడు : అంగన్వాడీలు శనివారం మండలంలోని పలు సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. వీరి ఆందోళనకు కో-ఆపరేటివ్ యూనియన్ కార్యదర్శి ఈశ్వరరావు మద్దతును తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, డోకల కుమారి, పి భవాని పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం సచివాలయంతో పాటు పలు సచివాలయాల వద్ద అంగన్వాడీలు నిరసనలు తెలిపి, వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంలో అంగన్వాడీలు భారీ ర్యాలీ నిర్వహించి, సచివాలయం-1 దగ్గర అందోళన చేసి, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.వెంకన్న, యునియన్ నాయకులు జి.వరలక్ష్మి, పద్మ కోమలి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : అంగన్వాడి కార్యకర్తలు శనివారం మండలంలోని బుచ్చయ్యపేట, రాజాం, వడ్డాది తదితర గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆది వరలక్ష్మి అమ్మాజీ, వెంకటలక్ష్మి చిలుకమ్మ, జగదాంబ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అంగన్వాడీలు శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కన్వీనర్ కే సోము నాయుడు, యూనియన్ నాయకులు బి జయ, వరలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

కలెక్టరేట్ : అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా 19వ రోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెంటనే చర్చలు ప్రారంభించాలని కోరారు. అంగన్‌వాడీలకు కేవలం రూ. 1000 వేతనం పెంచి, రూ.4,500 పెంచామని అబద్ధాలు చెప్పడం మానాలన్నారు. యూనియన్ నాయకులు పి.శ్యామలాదేవి, చెల్లయమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు పి.రామలక్ష్మి పాల్గొన్నారు.


పెందుర్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరవధిక సమ్మెకు ఐద్వా నేత అనంతలక్ష్మి సంఘీభావం తెలిపారు. 19 రోజులుగా అంగన్వాడీలు రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే, సిఎం జగన్ కనీసం కనికరం చూపకపోవడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షురాలు కె.బృందావతి, భవాని దేవి పాల్గొన్నారు

పద్మనాభం: నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంగన్వాడీలకు సిఐటియు, ఎఐటియుసి నేతలు సంఘీభావం తెలిపారు.


ట్యాబులు ఇస్తున్న ఎంపిపి

విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ

ప్రజాశక్తి రావికమతం: ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థికంగా భారం పడుతున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ట్యాబ్ లు పంపిణీ చేస్తుందని ఎంపీపీ పైలా రాజు తెలిపారు. మండల కేంద్రం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు శనివారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంపన్నులకే పరిమితమైన డిజిటల్ విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్ లు ఇస్తున్నామన్నారు. బైజూస్ సంస్థ రూపొందించిన పాఠాలు మాత్రమే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మాజీ, మండల పార్టీ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు కంచిపాటి జగన్నాధరావు , రావికమతం జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్ కొసిరెడ్డి ప్రసాద్, మాజీ జెడ్పిటిసి ఆసరి వాసు గోవిందరావు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, సర్పంచ్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల:స్థానిక రైతు భరోసా మూడవ కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వరి మద్దతు ధర క్వింటాకు రూ.2183 ప్రకటించిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తారన్నారు.ఈ క్రాఫ్‌లో

పంట వివరాలు నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తయిన రైతుల వద్ద నుండి మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బికే చైర్మన్ కుక్కర శ్రీధర్, సిబ్బంది జ్యోతి, రేణుక పాల్గొన్నారు.


చెక్ అందజేస్తున్న మణిరాజు

రూ.2లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు పిఎసి ఎస్‌లో శనివారం బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్ ను అందజేశారు. సంఘ సభ్యుడు, కల్లుగీత కార్మికుడు దొంగల దాదమ్మ కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి జారి పడి మృతి చెందాడు. ఈ మేరకు మృతి చెందిన వ్యక్తి కి పిఎసిఎస్‌లో సభ్యత్వం ఉన్నందున యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద 2 లక్షలు రావడంతో, ఇందుకు సంబంధించిన చెక్‌ను పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి అయినంపూడి మణి రాజు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సూపర్ వైజరు భాస్కరరావు, పిఎసిఎస్ డైరెక్టర్లు, సంఘ సీఈఓ సత్యనారాయణ చేతుల మీదుగా మృతుని భార్య రమణమ్మకు అందజేసారు.

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో తట్టబంద, తోటకూరపాలెం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తట్టబంధ సర్పంచ్ గోకివాడ రమణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా జగన్ ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.వీటిని సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనసేన నేత అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నంలో జరుగుతున్న సాధికార బస్సు యాత్ర నేపథ్యంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన సూర్యచంద్రను నాతవరం మండలం చెర్లోపాలెంలో ఆయన స్వగృహంలో అరెస్టు చేసి గొలుగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ మాట్లాడుతూ,
ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నం మానుకోవాలన్నారు.

రూ.40 వేల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మాడుగుల: జనసేన క్రియాశీలక సభ్యుడు అకాలంగా మరణించడంతో బాధిత కుటుంబానికి రూ.40 వేల ఆ పార్టీ ఆర్థిక సహాయాన్ని అందించింది. శనివారం మండలంలో సాగరం పంచాయతీకి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కొమర అచ్చం నాయుడు కుటుంబాన్ని మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఆయన చేతుల మీదుగా అధిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్, మాడుగుల మండల నాయకులు కాలింగ బలరాం, రామకృష్ణ, ఈశ్వరరావు, హరిబాల, గుమ్మలా అప్పలనాయుడు, కుంచ అంజిబాబు, శ్రీను, గుమ్మడి సంతోష్, మజ్జి కృష్ణ, యాళ్ల ప్రసాదు పాల్గొన్నారు.

సిఐటియు నేత రాజు అరెస్టు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నంలో వైసిపి సాధికార బస్సు యాత్ర చేపడుతున్న నేపథ్యంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజును ఉదయం 7గంటల సమయంలో ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేసి టౌన్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ప్రజలు, కార్మికుల పక్షాన పోరాడుతున్న తమను అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమను అరెస్టులు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇప్పటికైె వైసీపీ ప్రభుత్వం అక్రమ నిర్బంధ చర్యలను విడనాడి, సమ్మెలో ఉన్న అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా అబియాన్ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, ఎల్.గౌరీ, కెవి.సూర్యప్రభలు డిమాండ్ చేశారు.


రాజును అరెస్టు చేస్తున్న పోలీసులు

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-మాకవరపాలెం:స్థానిక అవంతి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎనలేనిది, మంచి నాయకులను ఎన్నుకోవడంతో అభివృద్ధి సాధించగలదన్నారు. అందుకుగాను 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన ఓటును విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. తహశీల్దార్ ఎంవివి.ప్రసాదరావు మాట్లాడుతూ, 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తమ ఓటును ఏమైనా గుర్తింపు కార్డు(ఆధార్ కార్డు)తో ఫారం 6 దరఖాస్తు పూర్తి చేసి ఓటరు నమోదు అధికారికి దాఖలు చేయడం ద్వారా నమోదు చేయించుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడు తన ఓటు నమోదు చేసుకొని ప్రజల కోసం పాటుపడే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్డీవో, తహశీల్దార్ లను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం


వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైవి సుబ్బారెడ్డి

టిడిపి పాలనలో అభివృద్ధి శూన్యం

నర్సీపట్నంలో సామాజిక సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నంలో శనివారం జరిగిన వైఎస్సార్సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం అయ్యింది. స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైవి సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి బయలుదేరిన బస్సు యాత్ర స్థానిక అబీద్ సెంటర్‌కు చేరుకొని భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు.ముందుగా వైసిపి నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, 14 సంవత్సరాలుగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసిన కాలంలో ఏ అభివృద్ధి చేయలేదన్నారు. అయ్యన్నపాత్రుడు శంకుస్థాపనలు చేయడం తప్ప పనులేవీ పూర్తి చేయలేదని విమర్శించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకుగాను మన నియోజకవర్గానికి మెడికల్ కాలేజీని ఇవ్వడం జరిగిందని కొనియాడారు.
ఎంపీ సత్యవతి మాట్లాడుతూ, ఎమ్మెల్యే గణేష్ చొరవవల్లే నర్సీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఏపీలో సంక్షేమ పాలన జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నార్నారు. మహిళల నేరాలు అదుపు చేసేందుకు దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యేలు అదీప్ రాజు, భాగ్యలక్ష్మి, ధర్మశ్రీ, స్థానిక మున్సిపాలిటీ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, గోల్కొండ జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్ చిన్నారులు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎదుర్కొందాం...

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని, కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎదుర్కొందామని 'ధూం.. ధాం'లో వక్తలు పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన గాజువాకలో మూడు రోజులుగా నిర్వహించిన ధూం.. ధాం కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మాలని బిజెపి ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రకటన చేసిందన్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆందోళన ప్రారంభించారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరచాలని బొగ్గును సరఫరా చేయకుండా, నిర్వహణ కోసం బ్యాంకుల నుంచి డబ్బులు ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. తీవ్రమైన నష్టాల్లోకి దిగజార్చాలని చూస్తోందని తెలిపారు. వారం రోజుల క్రితం బిఎఫ్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు ముక్కలు చేసి ఎన్నికల్లో ముడుపులు సహాయం చేసిన వారికి ధారాదత్తం చేయాలని చూస్తోందని విమర్శించారు.

ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజానాట్యమండలి చేపట్టిన ధూం.. ధాం కార్యక్రమాన్ని అభినందించారు. మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రజానాట్యమండలి చేస్తున్న ఈ కార్యక్రమం మరిన్ని ప్రాంతాలకు విస్తరించి ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వేణు, కె.సంతోషం, విసిసి సభ్యులు లీలావతి, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, స్టీల్‌ప్లాంట్ సిఐటియు డివిజన్ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ, సిఐటియు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు నమ్మి రమణ, కౌశిక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు..

ధూం.. ధాం కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు చేసిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గేయాలు, రైతు కష్టాలు, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాలపై చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ప్రదర్శనలిచ్చిన కళాకారులందరికీ అతిథుల ద్వారా జ్ఞాపికలను అందించారు.

నేత్రదానంతో మరొకరికి చూపు

ప్రజాశక్తి -చీడికాడ: కంటిని దానం చేయడంతో మరొకరికి చూపును ప్రసాదించవచ్చునింగా గ్రామ ఉప సర్పంచ్ చైతన్య తెలిపారు. మండలంలోని జైతవరం గ్రామానికి చెందిన కంటిపాము అప్పారావు అనారోగ్యంతో చనిపోవడంతో కుటుంబ సభ్యులు సంతోష్ తన తండ్రి నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ చైతన్య మాట్లాడుతూ నేత్రాలను దానం చేయాలన్నారు.

చీడిపల్లి గ్రామ అభివృద్ధికి కృషి : బూడి

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని చీడిపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. చీడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న సిసి డ్రైనేజీ పనులను శనివారం స్థానిక సర్పంచ్ కసిరెడ్డి సూర్యనారాయణ, గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే గ్రామంలో సిసి డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేశానన్నారు. ఇంకను అవసరమైన మేరకు నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు అంతకుముందు సర్పంచ్ కసిరెడ్డి సూర్యనారాయణ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం బూడి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బూడి స్పందించి నిధులు మంజూరు చేశారు. ఆయన వెంట వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన చైర్మన్

ప్రజాశక్తి -కొత్తకోట:స్థానిక పిహెచ్‌సిని రావికమతం మండల పరిషత్ ఎంపీపీ, హాస్పటల్ కమిటీ చైర్మన్ పైల రాజు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో స్టాఫ్ వివరాలు, ఓపి రిజిస్టర్, ల్యాబ్, థియేటర్, స్టోర్ రూమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, సుమారు 20 గ్రామాలకు వైద్య సేవలు అందించే పిహెచ్‌సి అభివృద్ధి కి తమ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. రోగుల పట్ల సానుకూలంగా సిబ్బంది వ్యవరించాలని సూచించారు. వైద్యాధికారులు రజనీ, మోహిని సురేఖలు ఎంపీపీ, ఇతర నాయకులకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు .. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గాలి రమణబాబు, ఫ్లోర్ లీడర్ పూడి దేవ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రిసోర్స్ పర్సన్ కోట బాబురావు తదితరులు పాల్గొన్నారు.